ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 . కనిష్ఠం : 23.0

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ
● రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ సిద్దేశ్వర్ 5

సర్కారు బడుల్లో క్యాలెండర్లు
» నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో 2,990 పాఠశాలలకు పంపిణీ

ఆపన్నహస్తం

» ప్రమాద బాధితులకు సంజీవనిలా 108 అంబులెన్సులు
» 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 1,56,972 మందికి సేవలు
» మెడికల్, గర్భిణులు, రోడ్డు ప్రమాద కేసులే అధికం
» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 గంటల సేవలు

ఆపదలో ఉన్నప్పుడు ఆప్తులు, బంధువులు వస్తారో.. రారో తెలియదుగానీ 108 అంబులెన్సు కచ్చితంగా వస్తుంది. కడుపునొప్పినా.. రోడ్డు ప్రమాదం జరిగినా.. పురిటినొప్పులు పడుతున్నా.. ఇంకేదైనా ప్రమాదం జరిగి అత్యవసరమైతే ఒక్క ఫోన్ చేస్తే అంబులెన్సు మీ ముందుంటుంది. వారి సేవలతో ప్రాణాలు పోసుకున్న వారు ఎందరో ఉన్నారు. గత 2024 ఆగస్టు వరకు 1,56,972 మంది 108 అంబులెన్సుల ద్వారా సేవలు పొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 71 అంబులెన్సులు నిరంతర సేవలు అందిస్తున్నాయి.

- మహబూబ్‌నగర్ వైద్య విభాగం (ఆంధ్రజ్యోతి)


అంబులెన్స్‌లో సేవలందిస్తున్న 108 సిబ్బంది(ఫైల్)



15 నిమిషాల్లో ఘటనా స్థలానికి..

108 అంబులెన్స్‌లు ఆపదలో ఆపన్నహస్తంలా, సంజీవనిలా పని చేస్తున్నాయి. ఫోన్ చేసిన 15 నిమిషాలలో ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్తున్నాయి. అంబులెన్స్‌లలో ఉండే జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా నేరుగా బాధితుడి లొకేషన్‌కు వెళ్తాయి. అక్కడ ప్రథమ చికిత్స చేసి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తారు. పురిటి నొప్పులతో వచ్చే గర్భిణులకు అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవాలు కూడా చేస్తున్నారు. జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ వంటి ఆస్పత్రులకు సైతం తీసుకెళ్తున్నారు.

మహబూబ్‌నగర్, వైద్యవిభాగం అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):ఆపదలో ఉన్నప్పుడు ఆప్తులు, బంధువులు వస్తారో.. రారో తెలియదు గానీ 108 అంబులెన్సు, అందులో ఉండే సిబ్బంది మాత్రం కచ్చితంగా వస్తారు. కడుపు నొప్పినా.. రోడ్డు ప్రమాదం జరిగినా.. పురిటి నొప్పులు పడుతున్నా.. ఇంకేదైనా ప్రమాదం జరిగి అత్యవసరమైతే ఒక్క ఫోన్ చేస్తే అంబులెన్స్ మీ ముందుంటుంది. ముందుగా ప్రథమ చికిత్స చేసి, ఆ తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్తారు. వారి సేవలతో ప్రాణాలు పోసుకున్నవారు ఎందరో ఉన్నారు. గత 2024 ఆగస్టు నెల వరకు 1,56,972 మంది 108 అంబులెన్సుల ద్వారా సేవలు పొందారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 71 అంబు లెన్సులు నిరంతర సేవలు అందిస్తున్నాయి.

71అంబులెన్సులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్‌లు 71 ఉన్నాయి. అందులో మహబూబ్‌నగర్‌లో జిల్లాలో 17 ఉండగా, నాగర్ కర్నూల్‌లో 19, వనపర్తిలో 13, గద్వాల్‌లో 11, నారాయణపేటలో 11 ఉన్నాయి. ఒక్కో అంబు లెన్సులో

(మిగతా 4లో..)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్‌ల ద్వారా సేవలు పొందిన బాధితుల వివరాలు

జిల్లా పేరు	మెడికల్	గర్భిణులు	రోడ్డు ప్రమాదాలు	గుండెకు సంబంధించినవి	శ్వాసకోశ బాధితులు	మొత్తం
మహబూబ్‌నగర్	26,589	5,197	3,381	1,373	1,696	38,236
నాగర్‌కర్నూల్	27,975	5,653	2,789	1,084	1,646	39,157
వనపర్తి	17,717	3,975	1,988	842	1,365	25,887
గద్వాల్	15,553	5,610	1,373	706	1,059	24,301
నారాయణపేట	19,858	5,110	2,121	870	1,432	29,391
మొత్తం	1,07,696	25,545	11,652	4,875	7,198	1,56,972

శరవేగంగా పనులు

» కొనసాగుతున్న కురుమూర్తి ఘాట్‌రోడ్డు నిర్మాణం
» దగ్గర పడుతోన్న బ్రహ్మోత్సవాలు


గుట్టల వద్ద కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

5

ఆదర్శంగా నిలిచిన ఆంజనేయులు

» భార్య పార్వతీదేవి పేరిట వైద్య కళాశాలకు అందించడం గొప్ప విషయం
» పుట్ట వరలక్ష్మి సంస్మరణ సభలో నివాళులర్పించిన చిన్నారెడ్డి


సంస్మరణ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

5

అందరికీ మెరుగైన.. న్యాయ ఫలాలు అందాలి

» హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్
» వనపర్తి జిల్లా కోర్టు భవనానికి వర్చువల్‌గా భూమి పూజ
» పూజలో పాల్గొన్న పోర్ట్ పోలియో హైకోర్టు జడ్జి అనిల్ కుమార్ జుకంటి


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు జస్టిస్ మాధవీదేవి, స్థానిక న్యాయాధికారులు, కలెక్టర్ ఆదర్శ్‌సురభి, న్యాయవాదులు

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయ ఫలాలు అందాలని ఆకాంక్షిస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్‌సింగ్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.81 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవన సముదాయానికి ఆయన వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైకోర్టు జస్టిస్ మాధవీదేవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు వనపర్తి జిల్లాకు వచ్చిన ముఖ్య అతిథులుగా వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్‌రావు, బార్ అసోసియేషన్ సభ్యులు పూల మొక్కలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా అపరేష్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ నూతన న్యాయ స్థానాల్లో మెరుగైన వసతులతో అందరికి న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. విజయదశమి పర్వదినాల సమయంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ నూతన కోర్టు భవన నిర్మాణం కోసం అందరి కృషి ఉందన్నారు. జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ తాను ఉమ్మడి పాలమూరు జిల్లా ఆడబిడ్డనే అని చెబుతూ వనపర్తిలో సంస్థానాధీశుల కాలం నుంచే న్యాయస్థానాలు ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయం అందించారన్నారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి అడుగులు పడడంలో వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి ఉందన్నారు. దేవాలయం లాంటి ఈ కోర్టు భవనంలో ప్రతీ ఒక్కరికి న్యాయ ఫలాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు జడ్జి, తెలంగాణ ఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున, జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత, ఆల్ ఇండియా బార్‌కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, హైకోర్టు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా లీగల్ అథారిటీ సెల్ కార్యదర్శి రజిని, సీనియర్ న్యాయాధికారులు కళార్చన, కవిత, జూనియర్ న్యాయాధికారులు కార్తీక్‌రెడ్డి, శ్రీలత, శిరీష, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నిండా నిర్లక్ష్యం

- సోమశిల రహదారిలో నిరుపయోగంగా ఎకో పార్కు


సోమశిల రహదారిలో తాళం వేసి ఉన్న ఎకో పార్కు ముఖ ద్వారం

కొల్లాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అటవీ, పర్యాటక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎకో పార్కు ఎందుకూ పనికిరాకుండా పోయింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల రహదారిలో రూ. 30లక్షలు వెచ్చించి పార్కును ఏర్పాటు చేశారు. పర్యాటకులు నల్లమల అందాలను ఎత్తైన ప్రదేశం నుంచి వీక్షించేందుకు వాచ్‌టవర్ నిర్మించారు. వాచ్ టవర్‌కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రహదారి దెబ్బతిన్నది. రోడ్డు మరమ్మతు చేయడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పార్కు గేట్లు తాళాలు వేశారు. గతేడాది సోమశిల పుష్కర ఘాట్ల నుంచి ఎకో పార్కు వరకు పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన సఫారీ వాహనం మూడు రోజులకే వెనక్కి పంపారు. ఎకో పార్కు ప్రారంభించాలని పర్యాటకుల నుంచి వినతులు వస్తున్నప్పటికీ రహదారి బాగా లేదనే సాకుతో అటవీ శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రి ఇలాకాలో పర్యాటకులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించలే కపోయారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అటవీశాఖ, పర్యాటక శాఖ అధికారులు చొరవ తీసుకుని ఎకో పార్కును అందుబాటులోకి తేవాలని పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు.


నిరుపయోగంగా వాచ్ టవర్


దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రం

12 యూనిట్ల ద్వారా కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గుతున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లోని 12 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 3.283 యూనిట్ల ఉత్పత్తిని చేపట్టగా... ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 371.472 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే కృష్ణా నది ద్వారా వరద ఉధృతి తగ్గిన కారణంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 370.862 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. వరద ఉధృతి ఇదే మాదిరిగానే కొనసాగితే విద్యుత్ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో కొనసాగించే అవకాశం ఉందన్నారు.

వ్యవసాయం వినూత్నం


ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరికోత యంత్రం

4

నిఘా షురూ..

» నాయకుల కదలికలపై పోలీసుల కన్ను
» సమస్యాత్మక గ్రామాల గుర్తింపు కోసం కసరత్తు
» జోగుళాంబ గద్వాల జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు
» శాంతియుతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం : డీఎస్పీ



గద్వాల క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు పోలీసులు నిఘా పెట్టారు. జిల్లాలో ఎన్నికల సందర్భంగా ప్రజలు ప్రలోభాలకు, భయాలకు లోనుకాకుండా ఉండేందుకు జిల్లా పోలీస్ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ పూర్తి స్థాయిలో విడుదల కాకముందే పోలీసులు అప్రమత్తం అవుతున్నారు. ఈ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసులు కృషి చేస్తున్నారు.

నాయకులు, అనుచరులపై పోలీసుల కన్ను

జిల్లాలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కొందరు బరిలో ఉన్న నాయకులు ఇప్పటినుంచే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కొత్తపుంతలు తొక్కుతున్నట్లు పోలీసుల నిఘాలో తేలింది. నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా పోలీసులు డేగా కన్నుతో నిఘా పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో కంటే ఈ ఎన్నికలు గ్రామ, మండల స్థాయిలో జరుగుతాయి కాబట్టి ఓటర్లను ఆకర్షించడానికి మద్యం, డబ్బు, ఇతర వస్తువులు ముందుగానే రవాణా చేసుకునేందుకు ప్రయత్నించకుండా ముందుగానే నిఘాఏర్పాటు చేశారు.

సమస్యాత్మక గ్రామాల గుర్తింపు..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయితీ సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా జిల్లా పోలీసులు సిద్ధం అవుతున్నారు. గతంలో జిల్లాలోని గద్వాల పరిధిలో 155, అలంపూర్ పరిధిలో 164 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, అన్ని మండలాలపై పోలీసులు ఇప్పటి నుండే నిఘా ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ఇల్లీగల్ యాక్టివిటీస్ చేసే వారిపై నిఘా ముమ్మరం చేసినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. గతంలో వివిధ నేరాలతో సంబంధం ఉన్న 782 మందిపై 319 బైండోవర్ కేసులు నమోదు చేయగా ఈ సారి వీటి సంఖ్య ఇంకా పెరిగేలా ఉందని తెలుస్తోంది. రాబోయే ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ కళా బృందాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి. ఎన్నికల నేపథ్యంలో అనుమానితులు గ్రామాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కొత్త వ్యక్తులకు అద్దెఇల్లు ఇచ్చేటప్పుడు వారి ఆధార్ కార్డును పరిశీలించాలి. మద్యం, డబ్బు, ఇతర వస్తువులు సరఫరా కాకుండా జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నాం.

- మొగులయ్య, డీఎస్పీ గద్వాల

కొనసాగని రాకపోకలు

- దుందుభీ నదిలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు


సిర్సవాడ వద్ద దుందుభీలో వరద ప్రవాహానికి పూర్తిగా కోసుకుపోయిన సీసీ రోడ్డు కింది భాగం

తాడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ నుంచి కల్వకుర్తి ఊర్కొండ మిడ్జిల్ మండలాల వైపు వెళ్లే లింకురోడ్డు అధ్వానంగా మారింది. జూలై మొదటి వారం నుంచి ఇప్పటి వరకు దుందుభీ నది ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టినందున సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి వాటి ద్వారా వరదను మళ్లిస్తే రాకపోకలు కొనసాగుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పత్తితీసే దశలోఉన్నందున రైతు కూలీలు, వాహనాలు నదిలో ఉన్న కాజ్‌వేపై నుంచి అవతలి వెళ్లేందుకు అవకాశం లేకపోవడం మూలంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని కనీసం సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మతులు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగాన్ని సహకరించాలని ఆయన కోరారు.

ప్రియాంక బలవన్మరణంపై డీఎస్పీ విచారణ 5
మనస్తాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య

హైవేపై ట్రాఫిక్ జామ్

● శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద గంటల తరబడి నిలిచిన వాహనాలు

● వేముల స్టేజీ వద్ద అండర్‌గ్రౌండ్ వంతెనతో రహదారి ఇరుకుగా మారి ఇక్కట్లు

మూసాపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దసరా పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్ వెళ్తుండటంతో ఆదివారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలోని జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసింది. శాఖాపూర్ ఎల్‌అండ్‌టీ టోల్‌ప్లాజా వద్ద వందలాది వాహనాలు కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. దాంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనుల వలన వాహనాలు వెళ్లడానికి రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు ముందుకు వెళ్లలేక ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, హైవే అథారిటీ టోల్‌ప్లాజా సిబ్బంది చేరుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.


మూసాపేట వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

ట్రాఫిక్‌ను పరిశీలించిన ఎస్పీ జానకి

బాలానగర్ మండల కేంద్రంలో నూతనంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున తరచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సమస్య పరిష్కారం కోసం స్థానిక పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి ఆదేశించారు. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్లు విశాలంగా లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పాడుతోంది. అంతేకాకుండా దసరా పండుగ సెలవులు ముగియడంతో జిల్లా నుంచి హైదరాబాద్‌కు జనం తిరగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల రద్దీ పెరిగింది. దాంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని ఎస్పీ జానకి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. స్వయంగా ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని, సహాయక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎస్పీ వెంట ఎస్ఐ లెనిన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బాలానగర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి



ఆపన్నహస్తం

(5వ పేజీ తరువాయి)

మంది, రోడ్డు ప్రమాద బాధితులు 11,652, గుండె సంబంధిత బాదితులు 4,875, ఆయాసం, శ్వాసకోశ సంబంధిత బాధితులు 7,198 మంది అంబులెన్స్‌లలో సేవలు పొందారు.

ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించొద్దు..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్సులు 71.. 24 గంటలు పని చేస్తున్నాయి. ఎక్కడి నుంచి ఫోన్ వచ్చినా 15 నిముషాలలో అంబులెన్స్‌లను పంపిస్తున్నాం. ప్రజలు ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించొద్దు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఉచితంగానే హైదరాబాద్‌కు కూడా పంపిస్తున్నాం. సేవలను వినియోగించుకోవాలి. ఏదైనా అసౌకర్యం కలిగితే వెంటనే 108కు ఫోన్ చేయండి. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిషలు పని చేస్తున్నాం.

- రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్, 108 అంబులెన్స్‌ల సేవలు


చిన్నపిల్లల అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది(ఫైల్)

టెట్‌పై గందరగోళాన్ని తొలగించాలి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : టెట్‌పై ఉపాధ్యాయుల్లో ఉన్న గందరగోళాన్ని తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న రూ.300 కోట్ల బకాయిలను ప్రతి నెల రూ.700 కోట్లు చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదన్నారు. విద్యారంగాన్ని బాగు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలకు రావల్సిన నిధులు కేటాంచాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావల్సిన పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర ఆరోగ్య విధానం అమలు చేయాలని, హెల్త్ కార్డు ఇవ్వాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, వెంకటేష్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చావరవి

శాస్త్ర ప్రచారాన్ని ఉద్యమంలా చేపట్టాలి

● జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర ప్రచారాన్ని ఉద్యమంలా చేపట్టాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో శాస్త్ర దృక్పథాన్ని కలిగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర ఫలాలను సామాన్య జనాలకు అందించేందుకు జేవీవీ ముందుండాలన్నారు. మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ సిలబస్‌లో జీవ పరిణామ సిద్ధాంతాన్ని పిరియాడిక్ టేబుల్‌ను తొలగించాలని, సంప్రదాయాలు పర్యావరణాన్ని రక్షించేలా ఉండాలన్నారు. అనంతరం సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటరమణ, జిల్లా ప్రతినిధులు వేణుగోపాల్‌వర్మ, ఆర్.ప్రమోద్‌కుమార్, జీ.సతీష్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి


నవాబ్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

● అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదివారం మహబూబ్‌గర్ అర్బన్, నవాబ్‌పేట, కోయిలకొండ, హన్వాడ మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. రెవెన్యూ సిబ్బందితో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులపై, ఎలక్షన్ క్లెయిమ్స్ క్లియర్ చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్ ఉంచవద్దని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో
- పాడైన బోర్లు... పట్టించుకోని అధికారులు
- వటువర్లపల్లిలో నెల రోజుగా నీటి సమస్య


వటువర్లపల్లిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు


బ్రహ్మగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామస్థులు ఆదివారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. వటువర్లపల్లిలో మహిళలు, యువకులు శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి పై కొద్ది సేపు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నాలుగు బోరు మోటార్లు పాడై నెలలు గడుస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా కుడా నీటి సరఫరా చేయడం లేదని వాపోయారు. నెల రోజులుగా గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి తాగునీటి సమస్య పరిష్క రించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు లచ్చిరాం, అంజయ్య, కుమార్, ఈరమ్మ, ఈదమ్మ ఉన్నారు.

సమస్య పరిష్కరిస్తాం : కార్యదర్శి

గ్రామంలో కొన్ని బోరుమోటార్లు పూడుకుపోయాయని వటువర్లపల్లి పంచాయతీ కార్యదర్శి రాంబాబు తెలిపారు. మరికొన్ని బాగు చేయించామని, గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఉద్దేశపూర్వకంగా పైపులైన్‌లను ధ్వంసం చేస్తూ నీటి సమస్యను సృష్టిస్తున్నారని అన్నారు. తొందరలోనే సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నాయనమ్మ అంతిమ యాత్రలో సినీ దర్శకుడు

- ఐతోలులో యశోదమ్మ పాడె మోసిన నాగ్ అశ్విన్


ఐతోల్ గ్రామంలో యశోదమ్మ పాడే మోస్తున్న నాగ్ అశ్విన్

తాడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ నాయనమ్మ యశోదమ్మ శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆదివారం నాగ్ అశ్విన్ స్వగ్రామమైన ఐతోల్‌లో యశోదమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. నాగ్‌అశ్విన్ యశోదమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నాయనమ్మ మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యశోదమ్మ మృతి కారణంగా అంతిమ కార్యక్రమంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. యశోదమ్మ ప్రముఖ కిడ్నీ స్పెషలిస్టు డాక్టర్ జయరాంరెడ్డి, నరసింహారెడ్డి, రంగారెడ్డి ముగ్గురు కుమారులు ఉన్నారు.

వ్యవసాయం వినూత్నం

▸ సాగులో సమయం, వ్యయం తగ్గిస్తున్న యంత్రాలు

▸ పెరుగుతున్న పంటల సాగు విస్తీర్ణం

▸ సబ్సిడీతో ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


దున్నేందుకు ఉపయోగించే నాగెళ్లు (కల్టివేటర్)


దున్నేందుకు ఉపయోగించే పెంచులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలానికనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు పనుల్లో యంత్రాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల కొరత అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో చేసే వ్యవసాయంతో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొవాల్సి రావడంతో యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. దుక్కిదున్నేది మొదలుకుని సరుకులను మార్కెట్‌కు తరలించే వరకు రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. తక్కువ సమయంలో సాగు విస్తీర్ణాన్ని పెంచడం, సకాలంలో పనులు పూర్తవడంతో అన్నదాతలు యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా యంత్రాలకు సబ్సిడీ కూడా ఇస్తుంది. దున్నడం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు యంత్రాలను వినియోగిస్తున్నారు. కొందరు రైతులు తమ పొలంలో వినియోగానికి యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

రోటేవేటర్ : మెట్ట పొలాలతోపాటుగా తరి పొలాల్లో ఈ రోటవేటర్ యంత్రాన్ని వినియోగిస్తారు. పొలంపై ఉన్న గడ్డిని కత్తిరించడంతోపాటుగా గడ్డలను చదును చేస్తుంది. మొక్కలు త్వరితగతిన తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. వీటి ధర రూ. లక్షా 45వేల వరకు పలుకుతుంది. ఈ యంత్రానికి ప్రభుత్వం గరిష్టంగా 50శాతం సబ్సిడీ ఇస్తుంది.

కల్టివేటర్ : కల్టివేటర్‌ను భూమిని దున్నేందుకు ఉపయోగిస్తారు. ట్రాక్టర్ సహాయంతో నాగళ్లతో దుక్కులు దున్నేందుకు గడ్డలు మెత్తగా చేసేందుకు ఉపయోగిస్తారు. కల్టివేటర్‌కు 6,7,9,11 నాగళ్లు ఉంటాయి. వీటి ధర సుమారు 48, 500 ఉంటుంది. ప్రభుత్వం 25శాతం సబ్సిడీ ఇస్తుంది.

హార్వెస్టర్ : (పంట నూర్పిడి యంత్రం) : పంట దిగుబడులు చేతికొచ్చిన తర్వాత మార్పిడి చేయడానికి ఈ హార్వెస్టర్ యంత్రం రైతులకు ఉపయోగపడుతుంది. కూలీల కొరత అధిగమించేందుకు ఈ యంత్రం సహాయ పడుతుంది. ఈ యంత్రంతో వరి, కంది, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ, మినుములు పంటలను నూర్పిడి చేసుకోవచ్చు. కళ్లాల పని లేకుండానే నేరుగా పంట గింజలే చేతికంది వస్తాయి. గంటకు ఒక ఎకరా వరకు ఏ పంటనైనానూర్పిడి చేసుకోవచ్చు.


సీడ్ డ్రిల్లర్ : (విత్తనాలు వేసే యంత్రం) : ప్రస్తుత వ్యవసాయంలో సీడ్ డ్రిల్లర్‌దే ప్రముఖ పాత్ర. పొలంలో వేగంగా విత్తనాలు విత్తేందుకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేవలం విత్తనాలే కాకుండా ఎరువులు ఫర్టిలైజర్స్‌ను ఏక కాలంలో సమ మోతాదులో వేసేందుకు వినియోగిస్తారు. వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, కందులు, మినుములు వంటి గింజ ధాన్యాలను విత్తేందుకు ఉపయోగపడుతుంది. పొలం స్వభావాన్ని బట్టి గంటకు ఎకరాకు పైగా విత్తనాలు విత్తుకోవచ్చు.

ప్లవ్ (నాగలి) : మెట్ట పొలాల్లో లోతు దుక్కులు దున్నడానికి ప్లవ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. 2, 3నాగళ్లు ఉండే ప్లవ్ ట్రాక్టర్ కలుపు భూమి లోపలికి చేరుతుంది. అదేవిధంగా లోతుగా ఉన్న మట్టిని బయటకు వచ్చి పంట దిగుబడులు పెరిగేందుకు సహాయ పడుతుంది. వీటి ధర సుమారు రూ.50వేల వరకు ఉంటుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● మల్దకల్ మండల నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్/గద్వాల న్యూటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచిన నేపథ్యంలో అందివచ్చిన అవకాశాన్ని గ్రామ, మండలస్థాయి నాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మల్దకల్ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. శాసనసభ ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరు అంతకుమించిన పట్టుదలతో గెలుపు కోసం పనిచేయాలన్నారు. మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి విభేదాలకు తావులేకుండా ఐక్యతతో పనిచేస్తూ అభ్యర్థుల గెలుపును ఎమ్మెల్యేకు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి ఉన్నారు.

క్యాంప్ కార్యాలయంలో..

గద్వాల న్యూటౌన్ : క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి నిర్వహించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు కలిసి కట్టుగా పనిచేసి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచుల అభ్యర్థులను గెలిపించి భవిష్యత్తులో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాజీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయం జిల్లా ప్రజల చిరకాల కోరిక

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయం మంజూరు జిల్లా ప్రజల చిరకాల కోరిక అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజల కోరిక మేరకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లా ప్రజల తరఫున తన అభ్యర్థనను గౌరవించి జిల్లా కేంద్రానికి కేంద్రియ విద్యాలయం మంజూరు చేశారని పేర్కొన్నారు. తన ప్రతిపాదనలను గుర్తించి కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం, జిల్లాకు కేవీ మంజూరు కావడంపై జిల్లా ప్రజల తరఫున సీఎం, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే ప్రభుత్వం నుంచి స్థలాన్ని, నిధులను త్వరితగతిని కేటాయించి పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి

రేవల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగపూర్ గ్రామంలో అనుమానాస్పదంగా దొడ్డి ఎల్లమ్మ (75) అనే వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొడ్డి ఎల్లమ్మకు భర్త దసరయ్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఎల్లమ్మ కుమారుడు మల్లయ్యకు భార్య బొగురమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉండగా... ఒక కుమారుడు క్యాన్సర్ వ్యాధితో మృతిచెందాడు. ఎల్లమ్మ కుమారుడు మల్లయ్య ఇంటి పక్కనే ఉన్న చిన్న గదిలో నివాసం ఉంటున్నాడు. ఆ గదిలో ఆదివారం ఉదయం వాసన రావడంతో గది తెరిచి చూడగా... అందులో ఎల్లమ్మ మృతదేహం కనిపించింది. ఎల్లమ్మ మృతిచెంది దాదాపు రెండు రోజులు అయిందని, అత్త కోడలు ఏమైన గొడవపడి ఉండొచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

రేవల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గడ్డం నరసింహ ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలో అత్తగారింటికి వెళ్లి మృతి చెందాడు. ఎస్ఐ రజిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారం గ్రామానికి చెందిన నరసింహ, పెంటమ్మ దంపతులకు కుమార్తె, ముగ్గురు కుమారులు. కుమార్తెని అన్నారం గ్రామానికి చెందిన నరసింహకు పది సంవత్సరాల కిందట ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె పిల్లలు ఉన్నారు. పది రోజుల కిందట శివలీల, భర్త నరసింహతో గొడవ పడి చెన్నారం గ్రామంలో పుట్టింటికి వచ్చింది. విజయ దశమి మరుసటి రోజు శుక్రవారం భార్యను తీసుకెళ్లడానికి అత్తారింటికి నరసింహ అదే రోజు రాత్రి మృతిచెందాడు. సమాచారం అందుకున్న నరసింహ తండ్రి నారాయణ చెన్నారం గ్రామానికి చేరుకుని, నరసింహ మృతదేహాన్ని పరిశీలించగా.. ఒంటిపై గాయాలు కనిపించాయి. అది చూసిన నారాయణ రేవల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

క్రైం కార్నర్

ప్రియాంక బలవన్మరణంపై డీఎస్పీ విచారణ



చిన్నోనిపల్లిలో విచారణ జరుపుతున్న డీఎస్పీ మొగులయ్య

గట్టు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గట్టు మండల పరిధిలోని చిన్నోనిపల్లి గ్రామాన్ని గద్వాల డీఎస్పీ మొగులయ్య ఆదివారం విచారణ చేపట్టారు. చిన్నోనిపల్లికి చెందిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడు నమ్మించి మోసం చేయడంతో కొత్త గూడెం జిల్లా పాల్వంచకు చెందిన యువతి ప్రియాంక (32) మనస్తాపంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి విచారణలో భాగంగా డీఎస్పీ మొగులయ్య, మిట్టదొడ్డి గ్రామంతో పాటు చిన్నోనిపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రియాంక ఉన్న ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం చిన్నోనిపల్లి గ్రామస్థులతో పలు విషయాలను తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ కేటీ మల్లేష్ తదితరులు ఉన్నారు.

మనస్తాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య



చింటు(ఫైల్)

కల్వకుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులు భూతగాదా విషయం మాట్లాడుకుంటుండగా విని మనస్తాపానికి గురై ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తర్నికల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ-2 రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన మల్లేష్, రాములమ్మల చిన్న కుమారుడు వస్పరి చింటు రంగారెడ్డి జిల్లా రాచులూరులోని గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. గ్రామంలో 20 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమి విషయం కుటుంబ సభ్యులం మాట్లాడుకుంటుండగా విని వస్పరి చింటు మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు కొడుకు ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతుండడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ-2 రాజశేఖర్ తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి.. కేసు నమోదు

మాగనూరు(కృష్ణ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల పరిధిలోని కొల్పూరు గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్పూరు గ్రామానికి చెందిన అంజప్ప తన ద్విచక్ర వాహనంపై పిల్లలతో కలిసి వేరే ఊరికి వెళ్తున్న అన్నను తన తమ్ముడు శంకర్ ఆపి తిరిగి ఇంటికి తీసుకువెళ్లాడు. ఇద్దరు అన్నదమ్ముళ్లు కలిసి మామ దగ్గర విషయం మాట్లాడాలని అన్నపై తమ్ముడు ఒత్తిడి తీసుకువచ్చాడు. అన్న అంజప్ప నిరాకరించడంతో తమ్ముడు అన్నపై ఇనుప కడ్డీతో తలపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అంజప్ప ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జున్ నాయక్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దామరగిద్ద, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం పేరవళ్ల గ్రామానికి చెందిన గొల్ల అనంతయ్య, భైకన్ వెంకటప్పలు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పేరవళ్ల గ్రామం నుంచి బాపన్‌పల్లి గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో దామరగిద్ద పోలీసులు పక్కా సమాచారంతో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. భైకెను వెంకటప్ప, గొల్ల అనంతయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అడవి సత్యారంలో..

కృష్ణ, (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అక్రమంగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల పరిధిలోని అడవి సత్యారం గ్రామ శివారులో చోటుచేసుకున్నది. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న స్థానికులు 100కు ఫిర్యాదు చేశారు. శనివారం అర్ధరాత్రి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇసుక లోడ్ ఖాళీ చేసి తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు అన్నారు.

కల్వకుర్తిలో దొంగతనం

కల్వకుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన వసంతపు మున్నీ ఇంట్లో దొంగతనం జరిగింది. పండుగ పూట ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి ఊరెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు బీరువా పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రెండు మాసాల కమ్మలు, ఒక చెక్కుడు గొలుసును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి బంధువులు తెలిపారు.

కారు, బైక్ ఢీ : నలుగురికి గాయాలు

వెల్దండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వెల్దండ మండల పరిధిలోని కొత్త తండా సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం... కల్వకుర్తి నుంచి దొంగరోడ్డుమీదుగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు బయలుదేరిన ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన వల్స భరత్‌గౌడ్, అతని భార్యలక్ష్మి, కూతురు వంశిక, కుమారుడు శర్విత్‌లు గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా..

కృష్ణ, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడి డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు, డ్రైవర్ ఉస్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. బైరోడ్డు మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సిన లారీ హిందూపూర్ వైపు వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో ఉస్మాన్ తల, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి.

అదుపుతప్పిన కారు..



నుజ్జు నుజ్జయిన కారు

ఎర్రవల్లి, (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల స్టేజీ దగ్గర 44వ జాతీయ రహదారిపై సోమవారం కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. కోదండాపురం ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. బెంగళూరులో ఉద్యోగ రీత్యా ఉన్న రవీంద్ర కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగకు హైదరాబాద్‌కు వచ్చారు. తిరిగి బెంగళూరుకు వెళ్తున్న క్రమంలో అతి వేగం, నిర్లక్ష్యంతో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టగా, కారులో ప్రయాణిస్తున్న రవీంద్ర, దక్షి, అశోక్‌కు రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

శరవేగంగా పనులు

- కొనసాగుతున్న కురుమూర్తి ఘాట్‌రోడ్డు నిర్మాణం
- దగ్గర పడుతున్న బ్రహ్మోత్సవాలు



గుట్టల వద్ద కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణం

చిన్నచింతకుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ వద్ద వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎలిమినేటర్ కారిడార్ నిర్మాణం పనులు చేపట్టింది. గత బ్రహ్మోత్సవాల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దీనికి భూమి పూజ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు భక్తులు గుట్టపైకి వెళ్లే మెట్లదారిలో కొంతమంది నడవలేని వారు, వృద్ధులు అనారోగ్య బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి వెళ్లింది. దాంతో సీఎం ఎలిమినేటర్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయన భూమిపూజకు స్వయంగా హాజరయ్యారు. ఇదిలా ఉండగా, ఎలిమినేటర్ కారిడార్ ఘాట్‌రోడ్డు పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇందులో ప్రధానంగా స్వామివారి గుట్ట ఎదురుగా ఉన్న గుట్టలను తొలిచి రోడ్డును నిర్మించే ఘాట్‌రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 2.859కిలోమీటర్ల ఫ్లైఓవర్, ఘాట్‌రోడ్డు నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రస్తుతం రిటర్నింగ్ వాల్ పైపు కల్వర్టు, బాక్స్ కల్వర్టు, జంగిల్ క్లీనింగ్, అండ్ బోర్డర్స్ రిఫ్యా రోడ్డుకు మట్టి వేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.110కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టారు.



గుట్టను తవ్వి రోడ్డు నిర్మాణ పనులు

● పనులు పూర్తయితే దర్శనం మరింత సులువు

కురుమూర్తి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఎలిమినేటర్ కారిడార్, ఘాట్‌రోడ్డు నిర్మాణాలు పూర్తి అయితే భక్తులకు మెట్లపై వెళ్లే మార్గం గుండా కాకుండా ఘాట్‌రోడ్డు మీదుగా ప్రయాణం మరింత సులభతరం కానుంది. దీంతో స్వామి వారి దర్శనం మరింత సులువు అయ్యే అవకాశం ఉంది.

● బ్రహ్మోత్సవాల నాటికి ఘాట్‌రోడ్డు పనులు పూర్తయ్యేనా?

ఈనెల 22నుంచి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో ఘాట్‌రోడ్డు నిర్మాణం పనులు అప్పటివరకు పూర్తవుతుందా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే పనుల జాప్యానికి కారణమైందని తెలుస్తుంది. వచ్చే బ్రహ్మోత్సవాలనాటికి మాత్రం ఎలిమినేటర్‌తో పాటు ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సర్కారుబడుల్లో క్యాలెండర్లు

- ఉమ్మడి జిల్లాలో 2990 పాఠశాలలు
- పాఠశాల నిర్వహణపై అన్ని విషయాలను పొందుపరిచిన విద్యాశాఖ
- నేటి నుంచి పంపిణీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్లు ఉంచాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతీ నెలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి? సెలవులు, పరీక్షలు ఎప్పుడు ఉంటాయో.. ఉపాధ్యాయులకు తప్ప విద్యార్థులకు తెలియడం లేదు. అందుకే విద్యా సంవత్సరానికి సంబంధించి ఏ నెలలో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తారో అన్ని విషయాలను తెలిసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

దీనికి అనుగుణంగా క్యాలెండర్లను రూపొందించి పాఠశాలకు అందించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. 2025 -2026 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీఈఆర్‌టీ దీన్ని రూపొందించింది. ప్రతీ పాఠశాలతో పాటు మండల వనరుల కేంద్రాలలో, డీఈవో కార్యాలయాలలో కలెక్టర్ కార్యాలయంలో రెండేసి చొప్పున ఉంచాలని విద్యాశాఖ ఆదేశించింది.

నెలవారీగా వివరాలు..

అకాడమిక్ క్యాలెండర్‌లో నెలల వారీగా చేపట్టాల్సిన క్యాక్రమాలను వివరించారు. ఏ నెలలో పాఠశాల ఎన్ని రోజులు పని చేస్తుందన్న విషయాన్ని వివరించారు. జూన్ నెలలో 15 రోజులు, జూలైలో 25 రోజులు, ఆగస్టులో 22 రోజులు, సెప్టెంబరులో 16 రోజులు, అక్టోబరులో 22 రోజులు, నవంబరులో 23 రోజులు, డిసెంబరులో 24 రోజులు, జనవరిలో 20 రోజులు, ఫిబ్రవరిలో 23 రోజులు, మార్చిలో 22 రోజులు , ఏప్రిల్‌లో 18 రోజులు పనిదినాలు ప్రకటించారు. ఏప్రిల్ 24 నుంచి 2026 జూన్ 11 వరకు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ క్యాలెండరు ఆవిష్కరించారు.



మహబూబ్‌నగర్‌లోని ఆర్వీఎం ఆవరణలో గల వేంకటేశ్వర కాలనీ ప్రభుత్వ పాఠశాల

క్యాలెండర్‌లో పొందుపర్చిన అంశాలు ఇలా..

- వార్షిక షెడ్యూల్‌లో బడిబాట పాఠశాల పునఃప్రారంభం, దసరా సెలవులు, క్రిస్మస్, సంక్రాంతి, వేసవి సెలవులు వివరాలను అందులో ఉంచారు.
- పరీక్షల షెడ్యూల్‌లో ఎస్ఏ-1 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల వరకు ఏయే తేదీల్లో నిర్వహించాలో పొందు పరిచారు.
- సిలబస్ పంపిణీలో స్కూల్ ప్రిపరేషన్ మాడ్యూల్స్, 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సిలబస్ ఎప్పటి వరకు పూర్తి చేయాలి.. రివిజన్ తరగతుల నిర్వహణ అంశాలను పొందుపరిచారు.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు పని చేసే సమయాలు పొందుపరిచారు.
- పాఠశాలల్లో ప్రతీ నెల నిర్వహించే కార్యక్రమాలు సమావేశాలు, పాఠశాల స్థాయిలో నిర్వహించే ఆటల పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్లు, ఇన్‌స్పైర్ అవార్డులు వంటి వివరాలను పొందుపరిచి ఆ సమయంలోనే కార్యక్రమాలు నిర్వహించాలని కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు.

● ఉమ్మడి జిల్లాలో 2990 పాఠశాలలకు పంపిణీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 2990 పాఠశాలలకు ఎమ్మార్సీలకు, డీఈవో కార్యాలయాల్లో పంపిణీకి సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని పాఠ్యపుస్తకాల గోదాంలోకి ఈ క్యాలెండర్ ఇప్పటికే వచ్చాయి. సోమవారం నుంచి మండల కేంద్రాలకు అందజేయన్నారు. మండల వనరుల కేంద్రాల నుంచి పాఠశాలకు చేరవేస్తారు. ఈ వారం చివరి వరకు అన్ని పాఠశాలల్లో క్యాలెండర్స్ ఉండే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

● పాఠశాలల్లో క్యాలెండరు తప్పనిసరి



అకాడమిక్ క్యాలెండర్ అన్ని పాఠశాలల్లో తప్పని సరిగా ఉంచాలి. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన క్యాలెండర్‌ను పాఠ్యపుస్తకాల గోదాం నుంచి ఎమ్మార్సీలకు సోమవారం నుంచి పంపిణీ చేస్తారు. ఎమ్మార్సీల నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీసుకువెళ్లాలి.

- దుంకుడు శ్రీనివాస్, ఏఎంవో, మహబూబ్‌నగర్

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ

- రాజీవ్‌గాంధీ పంచాయత్‌రాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ సిద్దేశ్వర్

చారకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని పలు రాష్ట్రాల్లో దొంగ ఓట్లతో గద్దెనెక్కిందని రాజీవ్‌గాంధీ పంచాయత్‌రాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ సిద్దేశ్వర్, రాజీవ్‌గాంధీ, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు చత్రునాయక్ అన్నారు. ఓటు చోరీపై ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని తిమ్మాయిపల్లిలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిద్దేశ్వర్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని పలు రాష్ట్రాల్లో దొంగ ఓట్లతో గద్దెనెక్కి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎలక్షన్ కమిషన్, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. ఓటు చోరీపై దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ పర్యటించి ప్రజలకు వివరిస్తున్నాని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రంగినేని శ్రీపతిరావు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ పానుగంటి అంజయ్య, మాజీ జడ్పీటీసీ భీముడునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గణేష్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, జేసీబీ వెంకటయ్యగౌడ్, శ్రీనివాసులు, పాండు, రేణయ్య, మల్లేష్, నాగార్జున, కృష్ణారావు, వెంకటేశ్, పవన్, రమేశ్, వినోద్, యాదగిరి, మనీదీప్, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ప్రయాణం.. ప్రాణ సంకటం

- శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

పెంట్లవెల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు గ్రామ సమీపంలో కృష్ణానదిపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. 1984 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కృష్ణానదిపై రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 41 సంవత్సరాలు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు నిత్యం భయాందోళనకు గురవు తున్నారు. ఆ బ్రిడ్జిపై ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు కొనసా గిస్తుంటాయి. కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పెద్ద పెద్ద లారీలు, ట్రక్కులు, ఆర్టీసీ బస్సులు నిత్యం రాక పోకలు సాగిస్తుంటాయి. బ్రి డ్జి శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. పెద్ద పెద్ద వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే బ్రిడ్జి కదలికలు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. బ్రిడ్జి రోడ్డుపై సందులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. జటప్రోలు గ్రామస్థులు గతంలో ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు.



ప్రమాదకరంగా జటప్రోలు బ్రిడ్జి

ఇనుప చువ్వలు తేలిన బ్రిడ్జి

ప్రమాదకరంగా ఇనుప చువ్వలు తేలి..



జటప్రోలు బ్రిడ్జి నిర్మాణం చేసి 41 సంవత్సరాలు కావడంతో ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై వాహనాలు వెళ్తుంటే బ్రిడ్జి కదలికలు ఏర్పడుతున్నాయి. నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- చిరంజీవి, వాహనదారుడు

నూతన బ్రిడ్జి నిర్మించాలి



బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం చర్య తీసుకొని నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- ప్రభాకర్‌రెడ్డి జటప్రోలు

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



స్వామి ఆలయ ప్రాంగణంలో రంగులు వేస్తున్న కూలీలు

చిన్నచింతకుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి వేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతున్నాయి. సరిగ్గా దీపావళి అమావాస్య రోజునుంచి ప్రారంభం కానుండటంతో స్వామి ఆలయం ముస్తాబవుతోంది. దానికి సంబంధించిన మెట్లు, క్యూలైన్‌ల వద్ద స్వామి వారి ప్రధాన గోపురం తదితర వాటికి రంగులు అద్దే కార్యక్రమం కొనసాగుతోంది.

జాతర మైదానంలో ఇప్పటికే వివిధ రకాల రంగుల రాట్నాలు దుకాణాలు, దుకాణ సముదాయాలు వంటివి ఏర్పాట్లు చేసేందుకు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఆదర్శంగా నిలిచిన ఆంజనేయులు

- భార్య పార్థివదేహాన్ని వైద్య కళాశాలకు అందించడం గొప్ప విషయం
- పుట్ట వరలక్ష్మి సంస్మరణ సభలో నివాళులర్పించిన చిన్నారెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వనపర్తి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ వైద్యులుగా ఎదగడానికి వరలక్ష్మి పార్థివదేహం అందించడం గొప్ప విషయం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల ఫంక్షన్ హాల్‌లో పుట్ట ఆంజనేయులు భార్య పుట్ట వరలక్ష్మి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంజనేయులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నిజమైన నాయకుడని అన్నారు.

వరలక్ష్మి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చి విద్యార్థుల బోధనకు ఉపయోగపడుతూ సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, వనపర్తి మండల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాండురావు, సురేష్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు.. పాలమూరు బిడ్డలు

మట్టిలో మాణిక్యాలు పాలమూరు బిడ్డలు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య కొనియాడారు. ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన కామ్రేడ్ పుట్ట వరలక్ష్మి సంస్మరణ సభ వనపర్తి జిల్లా కేంద్రం సమీపంలోని చిట్యాల డీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభకు సీపీఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అధ్యక్షత వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య, వెంకట్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి సదుర్ల వినయ్ కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, రాష్ట్ర నాయకుడు వెంకట్ రాములు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, సీపీఎం ఉమ్మడి జిల్లా కార్య దర్శులు రాములు, వర్దం పర్వతాలు, వెంకటస్వామి, పుట్ట వరలక్ష్మి కుమారుడు భరత్, కోడలు లక్ష్మీప్రసన్న, కూతురు దివ్య, అల్లుడు స్వామి, గోపాల్, అత్తమ్మ, పుట్ట బాలమ్మ, సీపీఎం సీనియర్ నాయకుడు అరుణ్ కుమార్, ప్రముఖ ప్రజా వైద్యశాల డాక్టర్ మురళీధర్, సీపీఎం నాయకులు శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, లక్ష్మి, మండ్ల రాజు, జీఎస్ గోపి, ఆంజనేయులు, ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, మాక్స్ విజన్ స్కూల్ యజమాని ఎల్లగౌడ్, డాక్టర్ భగవంతు ఉమ్మడి జిల్లాలోని ప్రజా సంఘాల నాయకులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు జిల్లా క్రీడాకారుడు



వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి యోగా టోర్నీకి జిల్లా యోగా క్రీడాకారుడు, సీనియర్ కరాటే మాస్టర్ కోటకదిర వెంకటేశ్ ఎంపికయ్యాడు. ఇటీవలే నల్గొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెంకటేశ్‌ను ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజ్ అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 7న జడ్చర్ల మినీ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి మెమో, ఆధార్, నాలుగు ఎలిజిబిలిటీ పత్రాలతో ఉదయం 9 గంటలకు పీడీ మోయిన్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో మూడోస్థానం



మూడోస్థానంలో నిలిచిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ టోర్నీలో బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచింది.

రాజోళి-వడ్డేపల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో?

● గుంతల రోడ్డుపై అవస్థల ప్రయాణం ● చెరువులను తలపిస్తున్న రాజోళి ప్రధాన రోడ్డు ● వినతులు, ధర్నాలు చేసినా పూర్తి కాని బీటీ రోడ్డు




పెద్దగోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రాజోళి- వడ్డేపల్లి ప్రధాన రోడ్డు



రోడ్డుపై గోతి వద్ద ప్రమాదానికి గురైన వాహనాలు (ఫైల్)

రాజోళి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజోళి - వడ్డేపల్లి మండల కేంద్రాల ప్రధాన రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందా? అని రెండు మండలాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి గుంతల రోడ్డుపై ప్రమాదాల బారిన పడుతూ ప్రయాణం చేస్తున్నా అధికారులు,ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దకాలంగా వడ్డేపల్లి మండలం నుంచి రాజోళికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో మండల ప్రజలు వినతులు, ధర్నాలు చేయడం వల్ల రాజోలి శివారు నుంచి బీజీరోడ్డు పనులు ప్రారంభించారు. ఏడు కిలోమీటర్ల రోడ్డులో మూడు కిలోమీటర్ల రోడ్డు మాత్రమే బీటీ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో వడ్డేపల్లి, శాంతినగర్ వరకు గుంతలమయంగానే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న భారత్ మాల రహదారి నిర్మాణంలో భాగంగా అధిక బరువుతో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు తిరుతుండటంతో మోకాలి లోతు, ఆరు అడుగుల వెడల్పులో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చిన్న వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. భారీ వర్షానికి ప్రధాన రోడ్డు మొత్తం బురదమయంగా మారి గుంతల్లో నీరు నిలిచి రోడ్డు చెరువును తలపిస్తున్నాయి. దీంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు బీటీ రోడ్డు వేయడం వల్ల రెండు మండలాలతో పాటు అంతర్రాష్ట్ర సరిహద్దు అయిన కర్నూలు జిల్లాలోని పలుప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం సుగమంఅవుతుంది. త్వరగా రోడ్డు బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నరకంగా ఉంది



రాజోలి నుంచి శాంతినగర్‌కు ప్రతీ రోజు వెళ్లివస్తాను. ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం నరకం అనుభవించినట్లు ఉంటుంది. వర్షాకాలంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. అత్యవసర సమయంలో అవస్థ చెప్పుకోలేము. ప్రభుత్వం చొరవ తీసుకుని రహదారిని బాగు చేయాలి.

- అడివిస్వామి, రాజోలి

భారీ వాహనాలు తిరగడం వల్లే సమస్య



14 ఏళ్లుగా బీటీ రోడ్డుకు నోచుకోని రాజోలి, శాంతినగర్ రోడ్డులో భారీ వాహనాలు తిరగడం వల్లే పెద్దగోతులు ఏర్పడి రోడ్డంతా పాడైంది. అస్తవ్యస్త రోడ్డులో ప్రయాణించలేక ఇక్కడి ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించాం. ధర్నాలు చేశాం. ఫలితం లేదు.

- కనికె శశికుమార్, రాజోలి

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

● నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతు నాయుడు

● బీఆర్ఎస్‌లో చేరిన పార్చర్ల నాయకులు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి హనుమంతు నాయుడు

ధరూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు అన్నారు. ధరూర్ మండలం పార్చర్ల గ్రామానికి చెందిన 200 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఆదివారం పట్టణంలోని హనుమంతు నాయుడు నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమంతు నాయుడు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని, ఎవరు చేరినా వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వారి వైఫల్యాలను ఎండ గట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, వెంకటేశ్ నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, శ్రీరాములు, జాంపల్లి భరత్‌సింహారెడ్డి, చిన్నయాదవ్, గోనుపాడు రాము, కార్యకర్తలు ఉన్నారు.

● కే.టి.దొడ్డి మండలం నుంచి..

గద్వాల న్యూటౌన్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసు హనుమంతునాయుడు అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కే.టి.దొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, చిన్న నర్సింరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మహానందరెడ్డి, డోలు వీరన్న, నాగిరెడ్డి, మరికొందరు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బాసు హనుమంతునాయుడు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోటీ చేసేందుకు శ్రేణులు సిద్ధం కావాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

గద్వాల టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు ఎన్నికల్లో అన్నిస్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు సూచించారు. స్థానిక సంస్థల్లో పోటీకి రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే అంగీకారం తెలిపిన నేపథ్యంలో ఆ దిశగా పార్టీని సిద్ధం చేసుకోవాలన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడిన ఆంజనేయులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకున్న నేపథ్యంలో అదే స్ఫూర్తితో ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. జిల్లాలో కలిసి వచ్చే పార్టీలతో కలిసి ఎన్నికలకు వెళ్లాలన్నది పార్టీ నిర్ణయమని, అందుకు అనుగుణంగా మండల, గ్రామస్థాయి కార్యకర్తలు తగిన రీతిలో సిద్ధం కావాలన్నారు. కాగా, ఇటీవల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఖారారు చేసిన రిజర్వేషన్ల సమాచారాన్ని అన్ని రాజకీయ పార్టీలకు సమగ్రంగా అందజేయడంలో కలెక్టర్ విఫలమయ్యారని ఆంజనేయులు ఆరోపించారు. సమావేశంలో అనుబంధ సంఘాల నాయకులు రంగన్న, పెద్దబాబు, ఆశన్న, రవి, పరమేశ్, కిష్టన్న ఉన్నారు.

రఘునాథ్‌గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

● దళిత, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

● ప్రియాంక మృతికి కొవ్వొత్తుల ర్యాలీతో సంతాపం

గద్వాలటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోగించి ఆత్మహత్యకు కారకుడైన కానిస్టేబుల్ రఘనాథ్ గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని స్మృతివనంలో విలేకరులతో మాట్లాడిన నాయకులు, గడచిన మూడు నెలలుగా తనకు న్యాయం జరగాలని పోరాడుతున్న యువతి ప్రియాంక ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమన్నారు. గతంలోనే పోలీసులు నిందితుడిని కఠినంగా శిక్షించి ఉంటే ఇంతటి ఘాతుకం జరిగేది కాదన్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి నిందితుడిని వెంటనే అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం ప్రియాంక మృతికి సంతాప సూచకంగా పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బహుజన రాజ్య సమితి, స్వేరోస్, బీఎస్పీ, దళిత, మైనార్టీ సంఘాల నాయకులు వాల్మీకి, మోహన్, రాజు, సునందం, ప్రవీణ్, వేమన్న, సాదతుల్లా తదితరులు ఉన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

అపూర్వ సమ్మేళనం



మల్దకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మల్దకల్ (గద్వాల), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మల్దకల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తాము చదువుకునే 24ఏళ్ల క్రితం రోజులను గుర్తు చేసుకుని మిత్రులతో సరదాగా గడిపారు. ఉన్నత చదువులు, ఉద్యోగాలకోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయిన వారంతా, ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. కొందరు ఉపాధ్యాయులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పోలీసు శాఖ, ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. మరికొందరు రాజకీయాల్లో రాణిస్తుండగా వారంతా కలిసి తమ పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు రాములు, వెంకటేశ్వర్లు, కళావతి, వరలక్ష్మి, వీరన్న, జార్జ్, మియాను సత్కరించారు.

గడప గడపకూ బీజేపీ

● మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ

అయిజ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గడప గడపకూ బీజేపీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా దేశ ప్రధాని మోదీ పనిచేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ అన్నారు. గడప గడపకూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం అయిజ మండల పరిధిలోని మూగోనిపల్లి గ్రామంలో కార్యకర్తలతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్లు, రైతువేదికలు, సన్నబియ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆపరేషన్ సిందూర్ విజయం, పల్లెలు, పట్టణాల అభివృద్ధి కోసం బీజేపీ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమం సాధించాలంటే బీజేపీతో సాధ్యం అవుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

ఎన్నికల సిబ్బంది శిక్షణ వేదిక మార్పు

● ఎంపీడీవో భాస్కర్

అయిజ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సిబ్బంది శిక్షణ వేదికలో మార్పు చేసినట్లు అయిజ ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం అయిజలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. శిక్షణలో భాగంగా సరిపడాహాలు, అవసరమైన ప్రాజెక్టర్ అందుబాటులో లేని కారణంగా ఉత్తనూర్‌లోని రైతువేదికకు మార్పు చేసినట్లు భాస్కర్ తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా శిక్షణకు హాజరయ్యే పీవో, ఏపీవోలు ఉత్తనూర్ రైతువేదికకు ఉదయం 10 గంటలకు హాజరుకావాల్సిందిగా కోరారు.

స్థానిక ఎన్నికల్లో విజయం మనదే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

● గద్వాల మండల కమిటీ సమావేశం

గద్వాల టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ విజయం సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆదివారం పట్టణంలోని డీకే బంగ్లాలో గద్వాల బీజేపీ మండల కమిటీ సమావేశం శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన రామాంజనేయులు, కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో విశ్వసనీయత సన్నగిల్లిందన్నారు. అదే సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలు సైతం ప్రజలకు ఆ పార్టీ పట్ల నిరాదరణను మిగిల్చాయన్నారు. బీజేపీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను కాపాడుకుంటూ స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు.

సమావేశంలో జడ్పీటీసీ ప్రభారి బలిగెర శివారెడ్డి, ఎంపీటీసీ ప్రభారి అక్కల రమాదేవి, పార్టీ నాయకులు నరేశ్, సర్వోత్తంరెడ్డి, సంగాల జయరాములు, అశోక్‌రెడ్డి, శోభారాణి, వెంకటమ్మ, బుచ్చన్న, రఘు, నరసింహులు, వెంకటస్వామి, రామిరెడ్డి, ఓంకార్, శ్రీకాంత్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం

గద్వాలసర్కిల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలోని కొత్తపల్లి, గుంటిపల్లి గ్రామాల్లో గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాల యూనిట్ 1, 2 ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం కొనసాగుతోంది. ఆదివారం నిర్వహించిన శిబిరంలో వలంటీర్లు గ్రామాల్లో రహదారులను, పిచ్చిమొక్కలను, ముళ్ల పొదలను పరిశుభ్రం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకుంటారని తెలిపారు. సామాజిక విలువలు పెంపొందించడానికి ఇలాంటి శిబిరాలు దోహదపడుతాయని వివరించారు. అనంతరం గ్రామాల్లో ఎయిడ్స్ నిర్మూలనతో పాటు మత్తుమందుల నిర్మూలన తదితర అంశాలపై నినదిస్తూ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ 1, 2 ప్రోగ్రాం అధికార్లు పవన్‌కుమార్, వీరేశం, విద్యార్థులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

గద్వాల అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సత్యసాయి విద్యామందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. సత్యసాయి విద్యామందిర్ కన్వీనర్ చిగుళ్లపల్లి సాయిప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో కర్నూలు నేత్ర వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులను ఉచితంగా అందజేశారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తుల స్వీకరణకు నేడు ఆఖరు

● అపరాధ రుసుముతో రేపటి నుంచి 23 వరకు

గద్వాల సర్కిల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న టెన్త్, ఇంటర్ 2025-26 విద్యా సంవత్సర దరఖాస్తుల స్వీకరణకు నేడు (సోమవారం) చివరి గడువు అని ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ సునీతమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆదేశానుసారం అపరాద రుసుముతో ఈ నెల 7వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రభుత్వ సూచించిన ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఉందని వివరించారు. అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగం లేదా జిల్లాలోని అధ్యయన కేంద్రాను సంప్రదించాలని సూచించారు.

దాత భీమన్నకు సన్మానం



భీమన్నను సన్మానిస్తున్న భగత్‌సింగ్ యూత్ సభ్యులు

వడ్డేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలేకల్ గ్రామంలో ఆదివారం చాకలి భీమన్నను భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ శివాలయం వద్ద ఉన్న కల్యాణ మండపానికి 21 ఫ్యాన్లను దాత భీమన్న అందజేశారన్నారు. కృతజ్ఞతగా ఆయనను అభినందించి పూలమాల, శాలువాతో సత్కరించామన్నారు.

వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి

● సంఘం రాష్ట్ర కార్యదర్శి పైపాడు శ్రీనివాసులు



వడ్డేపల్లిలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వడ్డేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి భావితరాలవారు ఆదర్శంగా తీసుకోవాలని వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి పైపాడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాల్మీకి మహర్షి ఆలయంలో కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 7న వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. పదవులు చిన్నవైనా, పెద్దవైనా పార్టీ ఏదైనా, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు.

అనంతరం వాల్మీకి కులబాంధవులను, సభ్యులు, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు నాగరాజు, రియల్ ఎస్టేట్ వ్యాపారి తుమ్మిళ్ల పరశును సన్మానించారు.

ఎల్‌వోసీని అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలన్యూటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం గట్టు మండల పరిధిలోని ఇందువాసి గ్రామానికి చెందిన మేకల మౌనికకు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే కే.టి.దొడ్డి మండలంలోని నందిన్నె గ్రామానికి చెందిన మాదిక నర్సప్పకు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుండి వచ్చిన రూ.2.50 లక్షల ఎల్‌వోసీ లెటర్‌ను ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు



వెంకటస్వామి(కాకా) చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి సరిత

గద్వాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల పెన్నిధిగా పేరుపొందిన దివంగత కాంగ్రెస్ నేత వెంకటస్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యులలో కాకా ఒకరని కొనియాడారు. ఇందిరా గాంధీ కుటుంబంతో ఆయనకు మంచి సంబంధాలు కలిగి ఉండటంతో నాయకుడిగా పేదలకు సేవ చేసే అవకాశం వచ్చిందని వివరించారు. ఆయన బాటలోనే ఆయన కుమారులు కొనసాగుతూ పేదలకు సేవలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇసాక్, మధుసూదన్‌బాబు, కబీర్‌దాస్ నర్సింహ, డీఆర్ శ్రీధర్, జమ్మిచేడు ఆనంద్, పాతపాలెం ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంలో కాంగ్రెస్ విఫలం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

రాజోలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రాజోలిలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపును సాధించాలని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ప్రస్తుతం అధికారంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాల్లో పూర్తిగా విఫలమైందని ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి అవగాహన కల్పించి రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాజోలి మండలంలోని స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ఈసీ ఆంజనేయులు, మల్లేశ్, రాజేశ్, రాము, భీమన్న, వీరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● అయిజ పెద్దవాగు వంతెనపై గొయ్యి పూడ్చివేత



కర్నూల్ రహదారి అయిజ పెద్దవాగు వంతెనపై గోతిని పూడ్చుతున్న పోలీసు, అధికారులు

అయిజ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతీ వ్యక్తి పనిచేయాల్సిన బాధ్యత ఉందని అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉదయం కర్నూల్ రహదారి అయిజ సమీపంలోని పెద్దవాగు కల్వర్టు వంతెనపై బారీ గొయ్యి ఏర్పడింది. ఇది ప్రమాద భరితంగా తయారయ్యింది. ఇది తెలిసిన ఎస్ఐ శ్రీనివాసరావు పోలీసు సిబ్బందిని పంపించి ప్రమాదసూచికలు ఏర్పాటు చేశారు. దీనితో సమస్య పరిష్కారం కాదు, ప్రమాదాలు నివారించలేమని భావించారు. ఆదివారం ఉదయం కర్నూల్ రహదారి అయిజ పెద్దవాగు వంతెనపై పడ్డ గొయ్యిని ఎస్ఐ శ్రీనివాస్ ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పూడ్చివేశారు. తాత్కాలికంగా కాకుండా రాళ్లు, సిమెంట్‌తో మరోమారు అక్కడ గొయ్యి పడకుండా పనులు చేశారు.

వర్షాలతో పత్తి పంటలకు తీవ్ర నష్టం



ఇటిక్యాల శివారులో సాగు చేసిన పత్తిపంట

ఇటిక్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పత్తి పంట చేతికి రాకుండాపోయాయి. మండలంలో ఈ ఏడాది 15వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వానాకాలం సీజన్ ఆరంభం నుంచి ఆశించిన స్థాయిలో అనుకూలంగా వర్షాలు పడగా, ఆగస్టు చివరి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు తెల్లబంగారం రైతులు తెల్లబోయేలా చేసింది. ఏపుగా ఎదిగి, ఊపు మీద ఉన్న పత్తిపంట కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. పొలాల్లో నీరు నిలిచి పత్తి కాయలు రాలి, పత్తి మొక్కలు కూడా నిలువునా మురిగిపోయాయి. ప్రస్తుతం పూత, పత్తికాయలతో కళకళలాడాల్సిన పంట వాన నీట మునిగి చేతికి రాకుండా పోయాయి.

పంటను కాపాడుకునేందుకు ఆరంభం నుంచి అష్టకష్టాలు పడుతుండగా వర్షాల కారణంగా ఎకరా పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంటలు రెండు క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు తెలుపుతున్నారు. ఎకరాకు రూ.30వేల వరకు ఖర్చు చేయడం జరిగిందని పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశా



ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.40వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రారంభంలో వర్షాలు కురియక ఆలస్యంగా విత్తాం. ఆ తర్వాత అధిక వర్షానికి పత్తి చేనులో నీరు నిలిచి మొక్కలు మురిగిపోయాయి. పత్తి కాయ దశలోనే అధిక వర్షాలకు నీరుపట్టి మునిగిపోయింది. కాయలు వర్షానికి రాలిపోయాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల పత్తి వచ్చే పరిస్థితి లేదు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఈదన్న, రైతు ఇటిక్యాల